# 15 ఏండ్ల తర్వాత..

## చెన్నైలో చెన్నైపై ఢిల్లీ విజయం

మెరిసిన కేఎల్ రాహుల్ • విజయ్ శంకర్ పోరాటం వృథా




ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు ధమాకా కొనసాగుతున్నది. గత సీజన్లకు భిన్నంగా నిలకడ ప్రదర్శిస్తూ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతున్నది. చెన్నై సూపర్‌కింగ్స్‌ను వారి సొంత ఇలాఖాలో మట్టికరిపించిన ఢిల్లీ హ్యాట్రిక్ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. తద్వారా 15 ఏండ్ల తర్వాత చెన్నైలో చెన్నైని ఢిల్లీ ఓడించి తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకుంది. కేఎల్ రాహుల్, ఇషాన్ పోరెల్ విజృంభణతో పోరాడే స్కోరు అందుకున్న ఢిల్లీ..చెన్నైని కట్టడి చేయడంలో సఫలమైంది. భారీ ఆశల మధ్య బరిలోకి దిగిన ధోనీ..మరోమారు అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు.

**సంక్షిప్త స్కోర్లు:**
**ఢిల్లీ:** 20 ఓవర్లలో 183/6(రాహుల్ 77, పోరెల్ 33, ఖలీల్ 2/25, జడేజా 1/19), **చెన్నై:** 20 ఓవర్లలో 158/5(శంకర్ 69 నాటౌట్, ధోనీ 30 నాటౌట్, నిగామ్ 2/27, స్టార్క్ 1/27)

చెన్నై: ఢిల్లీ క్యాపిటల్స్ సుదీర్ఘ కల సాకారమైంది. ఏండ్లుగా కొరకరాని కొయ్యగా మారిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఎట్టకేలకు ఢిల్లీ చెక్ పెట్టింది. శనివారం చెపాక్‌లో జరిగిన పోరులో ఢిల్లీ 25 పరుగుల తేడాతో చెన్నైపై విజయం సాధించింది. 2010 తర్వాత చెపాక్‌లో చెన్నైపై ఢిల్లీకి ఇదే తొలి విజయం కావడం విశేషం. తొలుత కేఎల్ రాహుల్(51 బంతుల్లో 77, 6ఫోర్లు, 3సిక్స్‌లు) సాధికారిక ఇన్నింగ్స్‌కు తోడు ఇషాన్ పోరెల్(33) ఇన్నింగ్స్‌తో ఢిల్లీ 20 ఓవర్లలో 183/6 స్కోరు చేసింది. ఖలీల్ అహ్మద్(2/25) రెండు వికెట్లు తీశాడు. లక్ష్యఛేదనకు దిగిన చెన్నై 20 ఓవర్లలో 158/5 స్కోరు చేసింది. టాపార్డర్ ఘోరంగా విఫలం కాగా, విజయ్ శంకర్(54 బంతుల్లో 69 నాటౌట్, 5ఫోర్లు, సిక్స్) అజేయ అర్ధసెంచరీతో పోరాడినా లాభం లేకపోయింది. ఆఖర్లో ధోనీ(26 బంతుల్లో 30 నాటౌట్, ఫోర్, సిక్స్) మెరుపులు మెరిపించడంలో విఫలమయ్యాడు. విప్రాజ్ నిగమ్(2/27) రెండు వికెట్లు తీశాడు. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈ సీజన్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన ఢిల్లీ అజేయంగా దూసుకెళుతున్నది.

**రాహుల్ రాణించగా:**
ఢిల్లీకి ఆదిలోనే ఓపెనర్ జేక్ ఫ్రేజర్(0) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ఖలీల్ అహ్మద్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ ఆఖరి బంతికి ఫ్రేజర్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత ఇన్నింగ్స్ బాధ్యతను రాహుల్, పోరెల్ పంచుకున్నారు. మంచి ఫామ్‌మీదున్న రాహుల్..చెన్నై బౌలింగ్ దీటుగా తిప్పికొడుతూ అద్భుతమైన షాట్లతో అలరించాడు. ఇన్నింగ్స్ గాడిలో పడుతుందన్న తరుణంలో పోరెల్‌ను జడేజా ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆఖర్లో స్టబ్స్(12 బంతుల్లో 24 నాటౌట్, 2ఫోర్లు, సిక్స్) విజృంభణతో ఢిల్లీ మెరుగైన స్కోరు అందుకుంది.

**చెన్నై పడుతూ లేస్తూ:**
లక్ష్యఛేదనలో చెన్నై ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. టాప్-3 బ్యాటర్లు రవీంద్ర(3), కాన్వే(13), కెప్టెన్ రుతురాజ్(5) ఘోరంగా విఫలమయ్యారు. దీంతో 41 పరుగులకే చెన్నై 3 కీలక వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో శంకర్ ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోయింది. ధోనీ మెరుపులు మెరిపించలేకపోయాడు.

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| ఢిల్లీ | 3 | 3 | 0 | 6 | 1.25 |
| బెంగళూరు | 3 | 2 | 1 | 4 | 1.14 |
| గుజరాత్ | 3 | 2 | 1 | 4 | 0.80 |
| పంజాబ్ | 3 | 2 | 1 | 4 | 0.07 |
| కోల్‌కతా | 4 | 2 | 2 | 4 | 0.07 |
| లక్నో | 4 | 2 | 2 | 4 | 0.04 |
| రాజస్థాన్ | 4 | 2 | 2 | 4 | -0.18 |
| ముంబై | 4 | 1 | 3 | 2 | 0.10 |
| చెన్నై | 4 | 1 | 3 | 2 | -0.89 |
| హైదరాబాద్ | 4 | 1 | 3 | 2 | -1.61 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్



## మ్యాచ్‌కు ధోనీ తల్లిదండ్రులు

చెన్నై సూపర్‌కింగ్స్ దిగ్గజ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ తల్లిదండ్రులు తొలిసారి ఐపీఎల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. శనివారం ఢిల్లీతో చెపాక్‌లో జరిగిన పోరుకు దేవికాదేవి, పాన్‌సింగ్ హాజరయ్యారు. వీరితో పాటు ధోనీ భార్య సాక్షి, కూతురు జివా కూడా స్టాండ్స్‌లో కనిపించారు. తల్లిదండ్రులు మ్యాచ్‌కు రావడంపై ధోనీ రిటైర్మెంట్‌పై మళ్లీ ఊహాగానాలు మొదలయ్యాయి. ఐపీఎల్‌కు ఇక వీడ్కోలు పలికేందుకు ధోనీ సిద్ధమయ్యాడంటూ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.



## పంత్, దిగ్వేశ్‌పై జరిమానా

లక్నో: లక్నో సూపర్‌జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్, దిగ్వేశ్ రాఠిపై జరిమానా పడింది. శుక్రవారం ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్ సందర్భంగా స్లోఓవర్‌రేట్‌కు పాల్పడినందుకు గాను కెప్టెన్ పంత్‌కు 12 లక్షల జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ పేర్కొంది. నిర్దేశిత సమయానికి మించి మ్యాచ్ కొనసాగడాన్ని కారణంగా పేర్కొన్న నిర్వాహకులు ఐపీఎల్ నియమ నిబంధనలు ఆర్టికల్ 2.22ను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మరోవైపు మిస్టరీ స్పిన్నర్‌గా మన్ననలు అందుకుంటున్న దిగ్వేశ్ మరోమారు 'నోట్‌బుక్ సెలెబ్రేషన్' చేసినందుకు మ్యాచ్ ఫీజులో 50శాతంతో పాటు రెండు డీమెరిట్ పాయింట్లు కోత విధించారు. ఆర్టికల్ 2.5 ప్రకారం లెవల్-1 తప్పిదం కింద జరిమానా వేసినట్లు లీగ్ వర్గాలు పేర్కొన్నాయి.

## ఫైనల్లో అభినాశ్

వరల్డ్ బాక్సింగ్ కప్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత యువ బాక్సర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. బ్రెజిల్ వేదికగా జరుగుతున్న టోర్నీలో బాక్సర్ అభినాశ్ జమ్వాల్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శనివారం జరిగిన పురుషుల 65కిలోల సెమీస్ బౌట్‌లో అభినాశ్ 5-0 తేడాతో గియానుల్జి మలాంగ(ఇటలీ)పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన శైలిలో చెలరేగిన అభినాశ్ ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. తన ఎత్తును అనుకూలంగా మలుచుకున్న జమ్వాల్ ప్రత్యర్థిపై పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడ్డాడు.







# కింగ్స్‌కు చెక్

పంజాబ్‌పై రాజస్థాన్ విజయం • రాణించిన జైస్వాల్, పరాగ్

ముల్లాన్‌పూర్: ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ వరుస విజయాల పరంపరకు రాజస్థాన్ రాయల్స్ చెక్ పెట్టింది. శనివారం డబుల్ ధమాకాలో భాగంగా జరిగిన రెండో పోరులో పంజాబ్‌పై రాజస్థాన్ 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో సొంత ఇలాఖాలో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుందామనుకున్న పంజాబ్ ఆశలపై రాజస్థాన్ నీళ్లు గుమ్మరించింది. తొలుత యశస్వి జైస్వాల్(45 బంతుల్లో 67, 3ఫోర్లు, 5సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు రియాన్ పరాగ్(25 బంతుల్లో 43 నాటౌట్, 3ఫోర్లు, 3సిక్స్‌లు) రాణించడంతో రాజస్థాన్ 20 ఓవర్లలో 205/4 స్కోరు చేసింది. ఆఖర్లో హెట్‌మైర్(12 బంతుల్లో 20, 2ఫోర్లు, సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో రాజస్థాన్ 200ల మార్క్ అందుకుంది. నిలకడలేమితో సతమతమవుతున్న జైస్వాల్..పంజాబ్‌తో మ్యాచ్‌లో అదరగొట్టాడు. కెప్టెన్ సంజూ శాంసన్(38) సహకారంతో జైస్వాల్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఓవైపు చూడచక్కని షాట్లతో అలరిస్తూ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. తన ఇన్నింగ్స్‌లో 3ఫోర్లు, 5 భారీ సిక్స్‌లతో దుమ్మురేపాడు. శాంసన్‌తో కలిసి తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన జైస్వాల్..పరాగ్‌తోనూ అదే దూకుడు కొనసాగించాడు. తానేం తక్కువ కాదన్నట్లు పరాగ్ కూడా చెలరేగడంతో పరుగుల రాక జోరందుకుంది. ఫెర్గుసన్‌కు(2/37) రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 155/9 స్కోరు చేసింది. నేహల్ వధేరా(41 బంతుల్లో 62, 4ఫోర్లు, 3సిక్స్‌లు) మినహా అందరూ విఫలమయ్యారు. మాక్స్‌వెల్(30) రాణించాడు. ఆర్చర్‌కు మూడు వికెట్లు దక్కగా,యుధ్‌వీర్, తీక్షణ రెండేసి వికెట్లు తీశారు.

**సంక్షిప్త స్కోర్లు**
**రాజస్థాన్:** 20 ఓవర్లలో 205/4(జైస్వాల్ 67, పరాగ్ 43 నాటౌట్, ఫెర్గుసన్ 2/37, అర్ష్‌దీప్ 1/35), **పంజాబ్:** 20 ఓవర్లలో 155/9 (నేహల్ 62, మ్యాక్స్‌వెల్ 30, సందీప్ 2/21, ఆర్చర్ 3/25)

## ఇషాసింగ్‌కు రజతం | షూటింగ్ ప్రపంచకప్





న్యూఢిల్లీ: బ్యూనస్ ఎయిర్స్(అర్జెంటీనా) వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. శనివారం జరిగిన వేర్వేరు విభాగాల్లో సిఫ్ట్‌కౌర్ సమ్రాకు స్వర్ణం, ఇషాసింగ్ రజత పతకంతో మెరిశారు. మహిళల 25మీటర్ల పిస్టల్ ఫైనల్లో తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్ 35 స్కోరుతో రెండో స్థానంలో నిలువగా, సున్ యుజి(38, చైనా), ఫెంగ్ జియూన్(30, చైనా)వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఒలింపియన్ కాంస్య విజేత మను భాకర్‌ను ఇషాసింగ్ ఓడించి ముందంజ వేసింది. మరోవైపు మహిళల 50మీటర్ల రైఫిల్-3 పొజిషన్ ఫైనల్లో సిఫ్ట్‌కౌర్ 458.6 పాయింట్లతో స్వర్ణం ఖాతాలో వేసుకోగా, అనీటా మాంగోల్డ్(455.3), అరీనా అలుఖోవా(445.9) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



## వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్

సుజుక(జపాన్): జపనీస్ గ్రాండ్‌ప్రి రేసులో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్‌కు పోల్‌పొజిషన్ దక్కింది. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రేసులో వెర్‌స్టాపెన్ 1:26:983సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచాడు. మెక్‌లారెన్ డ్రైవర్స్ నోరిస్ (1:26:995), పియాస్ట్రి (1:27:027) వరుసగా రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నారు.

## కివీస్ క్లీన్‌స్వీప్ పాక్‌తో మూడో వన్డేలో ఘన విజయం

మౌంట్ మౌంగనుయి(న్యూజిలాండ్): పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌ను న్యూజిలాండ్ క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం జరిగిన మూడో వన్డేలో కివీస్ 43 పరుగుల తేడాతో పాక్‌పై విజయం సాధించింది. తొలుత కెప్టెన్ మిచెల్ బ్రేస్‌వెల్(59), రైస్ మారివు(58) అర్ధసెంచరీలతో నిర్ణీత 50 ఓవర్లలో 264/8 స్కోరు చేసింది. పాక్ బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంటూ కివీస్ సాధికారిక స్కోరు సాధించింది. అఖిఫ్ జావెద్(4/62) నాలుగు వికెట్లతో విజృంభించాడు. లక్ష్యఛేదనకు దిగిన బెన్‌సీయర్స్(5/34) ధాటికి పాక్ 40 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్(50) అర్ధసెంచరీ ప్రదర్శన మినహా ఎవరూ రాణించలేకపోయారు. బ్రేస్‌వెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.




# కల్యాణ వైభోగమే

భద్రాచలంలో నేడు సీతారాముల కల్యాణం

మిథిలా స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి

రేపు శ్రీరామ మహా పట్టాభిషేకం



విద్యుద్దీపాల వెలుగులో దేదీప్యమానంగా భద్రాద్రి రామాలయం

భద్రాచలం, ఏప్రిల్ 5: భద్రాచల క్షేత్రంలో ఆదివారం జరుగనున్న మహాఘట్టానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాచలంలో ఆదివారం రాములోరు సీతమ్మను పరిణయమాడే ఘట్టాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ర్టాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చారు. కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు సమర్పించనున్నారు. జగత్కల్యాణాన్ని తిలకించేందుకు మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు హాజరుకానున్నారు. శ్రీరామనవమి సందర్భంగా రామాలయాన్ని విద్యుద్దీపాలతో సుందరీకరించారు. మిథిలా స్టేడియంలో శిల్పకళా శోభితమైన కల్యాణ మండపాన్ని అద్భుతంగా అలంకరించారు. స్టేడియంలో 100 టన్నుల ఏసీతో పాటు, వంద కూలర్లు, 250 ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఉదయం 10:30 గంటలకు తిరు కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. కల్యాణ వేడుకలో భాగంగా శనివారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. గరుత్మంతుడి వాహనంపై స్వామివారిని మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న వైకుంఠద్వారం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. శ్రీసీతారాముల వైభవాన్ని లోకానికి తెలియచెప్పేందుకే ఎదుర్కోలు వేడుక నిర్వహిస్తున్నట్టు పండితులు ఉపదేశించారు. అనంతరం ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లను ఆలయానికి తీసుకువెళ్లారు. కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల కోసం మూడు లక్షల లడ్డూలను దేవస్థానం అధికారులు సిద్ధం చేశారు. మిథిలా స్టేడియంలో సోమవారం శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని నిర్వహించనున్నారు. పట్టాభిషేకాన్ని తిలకించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరై పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో 1,800 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆలయ ఈవో రమాదేవి, అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.



కొడకండ్లలో మూతపడిన రేషన్‌షాపు-3

# సన్నబియ్యం నోస్టాక్

- గోదాముల నుంచి రాక రేషన్‌షాపుల మూత
- జనగామ జిల్లా కొడకండ్లలో ఎనిమిది షాపులు బంద్

కొడకండ్ల, ఏప్రిల్ 5 : రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ఉగాది పండుగ రోజు ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ పథకానికి ఆదిలోనే హంసపాదులా మారింది. జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని పలు రేషన్‌షాపులకు సన్నబియ్యం సరఫరా కాలేదు. కొడకండ్ల మండలంలో 19 రేషన్‌షాపులు ఉండగా వీటిలో కొడకండ్లలోని రేషన్ షాపు నంబర్-3తోపాటు లక్ష్మక్కపల్లి, నర్సింగాపురం, మొండ్రాయి, ఏడునూతుల,రంగాపురం, పాఖాలలోని ఎనిమిది షాపులకు సన్నబియ్యం సరఫరా కాలేదు. సన్నబియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు షాపుల వద్దకు వస్తుండటంతో చేసేదేమీ లేక డీలర్లు షాపులను బంద్ చేశారు. మరోవైపు నర్సింగాపురంలో 55 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా వీటిలో 25 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వీటిని పంపిణీ చేసిన డీలర్ మిగతా స్టాక్ రాకపోవడంతో షాపును బంద్ చేశారు. కొడకండ్లలోని రేషన్ షాపు నంబర్-3కు 40 క్వింటాళ్ల స్టాక్ ఇవ్వగా ఒక్క రోజులోనే పంపిణీ చేశారు. మిగిలిన స్టాక్ రాకపోవడంతో డీలర్ షాప్‌ను మూసేశారు. దీనిపై తహసీల్దార్ చంద్రమోహన్‌ను వివరణ కోరగా సన్నబియ్యం సరిపడా రాలేదని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చినట్టు తెలిపారు. రాత్రి వరకు బియ్యం వస్తాయని ఆదివారం నుంచి అన్నిషాపుల్లోనూ పంపిణీ చేస్తామని చెప్పారు.

**బియ్యం బస్తాల్లో తూకం సమస్య**

తొర్రూరు, ఏప్రిల్ 5 : సన్నబియ్యంలో బస్తాలో తూకం తక్కువగా వస్తుందని పలువురు రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి బియ్యం బస్తాలో 2 నుంచి 5 కిలోల వరకు తక్కువ వచ్చినట్టు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని డీలర్లు పేర్కొన్నారు.



మొత్యతండాలో గ్యారెంటీలపై నిలదీస్తున్న ప్రజలను వారిస్తున్న కాంగ్రెస్ నేత రాజేశ్వర్‌రావు

# ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?


- హామీలిచ్చి చేతులెత్తేస్తారా?
- ఎమ్మెల్యే నాగరాజును నిలదీసిన మహిళలు

పర్వతగిరి, ఏప్రిల్ 5: అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని ప్రజలు భగ్గుమంటున్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారంలో శనివారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' యాత్రలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ నేత వరద రాజేశ్వర్‌రావు పాల్గొనగా ప్రజలు సమస్యలపై నిలదీశారు. దూపతండా, పెద్దతండా, మొత్యతండా, రావూర్ మీదుగా సాగినయాత్రలో తండావాసులు కాంగ్రెస్ పాలనపై మండిపడ్డారు. గ్యారెంటీలు అమలుచేయకపోతే స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. 'ఆసరా పింఛన్లు పెంచలేదు. 2 లక్షలల్లోపు మాఫీ పూర్తిగా అమలు కాలేదు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఏమైంది' అంటూ ఎమ్మెల్యే నాగరాజుతోపాటు కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. యాత్రతో పార్టీకి మైలేజీ వస్తుందనుకుంటే సీన్ రివర్స్ అయ్యిందని చర్చించుకోవడం గమనార్హం. పేదల ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేసి సానుభూతి తెచ్చుకోవాలనుకుంటే సదరు నాయకులకు చుక్కెదురైంది. రావూర్‌లో మీడియాతో మాట్లాడుతుండగానే కరెంట్ కట్ కావడంతో ఆ పార్టీ నేతలు అసంతృప్తికి గురయ్యారు. ఇలాగైతే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కష్టమేనని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుకోవడం వినిపించింది.

# లక్ష టన్నుల బియ్యానికి లాస్ 150 కోట్లు!

› మొదటిపేజీ తరువాయి...

ఒప్పందాలు పూర్తయ్యాయి. దీంతో గత నెల 31న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కాకినాడ రేవులో జెండా ఊపి 12,500 టన్నుల బియ్యం ఎగుమతిని ప్రారంభించారు. దీంతో ఎక్కువ ధర ఇచ్చే ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వకుండా తక్కువ ధరతో ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. రేషన్ బియ్యం కోసం కిలోకు రూ.40 ఖర్చు చేస్తున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించారు. ఈ లెక్కన మన రాష్ట్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగిస్తే కేజీకి రూ.40 చొప్పున చెల్లిస్తుంది. కానీ, ఇప్పుడు పౌరసరఫరాల శాఖ కేజీ బియ్యం రూ.36 చొప్పున ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేస్తున్నది. ఇది ఎఫ్‌సీఐ ఇచ్చే ధర కంటే రూ.4 తక్కువ. ఎఫ్‌సీఐకి 25% నూకతో దొడ్డు బియ్యం ఇచ్చినా ఇబ్బంది ఉండదు. కానీ, ఒప్పందం ప్రకారం ఫిలిప్పీన్స్‌కు కేవలం 5% నూకతో నాణ్యమైన బియ్యాన్ని ఎగుమతి చేయాలి. ఈ క్రమంలో నూకను 25 నుంచి 5 శాతానికి తగ్గించేందుకు పౌరసరఫరాల శాఖ కేజీకి రూ.3 చొప్పున మిల్లర్లకు నష్టపరిహారం చెల్లిస్తున్నది. దీనితోపాటు మిల్లుల నుంచి కాకినాడ పోర్టు వరకు రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులన్నీ పౌరసరఫరాల శాఖే భరించాల్సి ఉంటుంది. అందుకోసం కేజీకి రూ.2-3 వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ లెక్కన ఆ శాఖపై కేజీకి రూ.6 వరకు అదనపు భారం పడుతుంది. దీంతో ఎఫ్‌సీఐ ధరతో పోల్చితే కలిగే నష్టం రూ.4, అదనపు నష్టం రూ.6 కలిపి కేజీపై రూ.10 వరకు నష్టపోవాల్సి వస్తుంది. ఫిలిప్పీన్స్ చెల్లించే రూ.36 నుంచి ఈ నష్టాన్ని తీసేస్తే కేజీ ధర రూ.26 మాత్రమే. అంటే ఎఫ్‌సీఐ ధరతో పోల్చితే ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేయడం వల్ల కేజీకి రూ.14 చొప్పున నష్టం సంభవిస్తుంది. ఈ లెక్కన క్వింటాలుకు రూ.1,400, టన్నుకు రూ.14 వేలు, తొలిదశలో ఎగుమతి చేసే లక్ష టన్నులకు రూ.140 కోట్ల నష్టం వాటిల్లుతుంది. దీనికి ఇతర ఖర్చులను కూడా కలిపితే నష్టం రూ.150 కోట్ల వరకు పెరుగుతుందని స్వయంగా పౌరసరఫరాల శాఖ అధికారులే స్పష్టం చేస్తున్నారు.



**ఎగుమతి వెనుక 'హస్తం' ఎవరిది?**

ఇంత నష్టమని తెలిసినప్పటికీ బియ్యం ఎగుమతి నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం ఎగుమతికి సంబంధించిన కనీస వివరాలను ప్రభుత్వం, అధికారులు వెల్లడించకపోవడం మరిన్ని అనుమానాలను రేపుతున్నది. అసలు ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా తక్కువ ధరతో ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేయాల్సిన అవసరం ఏమొచ్చింది, దీని వెనుక ఎవరి 'హస్తం' ఉందన్న ప్రశ్నలు అందరినీ తొలిచేస్తున్నాయి. ఇప్పటికే తన వద్ద ఉన్న 38 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించిన పౌరసరఫరాల శాఖ.. ఇప్పుడు ఎగుమతి కోసం ఎక్కడి నుంచి బియ్యం సేకరిస్తున్నది? ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో కోత పెడుతున్నదా? అదే జరిగితే ఎక్కువ ధర చెల్లించే ఎఫ్‌సీఐని కాదని తక్కువ ధర వచ్చే ఫిలిప్పీన్స్ వెంట ఎందుకు పరుగులు పెడుతున్నట్టు? వేలం వేసిన ధాన్యాన్ని బిడ్డర్లు ఎత్తకపోతే ఆ ధాన్యాన్నే మిల్లింగ్ చేసి ఎగుమతి చేస్తున్నదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే కచ్చితంగా బిడ్డర్లకు మేలు చేయడమే అవుతుందని, నిబంధనల ప్రకారం ధాన్యం ఎత్తకుండా, పౌరసరఫరాల సంస్థకు డబ్బులు చెల్లించని బిడ్డర్లపై చర్యలు చేపట్టకుండా వారికి ఉపశమనం కలిగించేలా ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎగమతి చేయడం తప్పనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైనప్పటికీ ఎగుమతి వెనుక ఏదో తతంగం నడుస్తున్నదని, దీని వెనుక ఏపీకి చెందిన ఓ బడా మిల్లర్, ఎగుమతి వ్యాపారి ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

## • చీకటిపడ్డాక సన్నబియ్యం పంపిణీ



పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఓ డివిజన్‌లో శనివారం రాత్రి ఓ డీలర్ సన్నబియ్యం పంపిణీ చేశారు. బియ్యం పంపిణీ విషయం తెలియక చాలామంది రేషన్ షాప్‌కు చేరుకోలేకపోయారు. ఆలస్యంగా తెలుసుకొన్న కొంతమంది అప్పటికప్పుడు పరుగున వచ్చారు. డీలర్ తీరుపై కార్డుదారులు తీవ్రఅసంతృప్తి వ్యక్తంచేశారు. - కోల్‌సిటీ

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.